## మినీ కథ

# ఆక్రోశం

"దీనంతటి ముదనష్టపుది ఇంకొకటి లేదు" అన్నాడు బాస్ నావైపు అసహ్యంగా చూస్తూ.

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కొంచెం అన్నా మర్యాదలేకుండా 'అదీ', 'ఇదీ' అంటూ అసభ్యంగా మాట్లాడుతున్నాడు. వీళ్ళు గొప్పవాళ్ళు! నా కంటి నీరు చూడ గలరా!?

"ఊరుకోండి! ఏంచేస్తాం!! దీని పరిస్థితి బాగోలేదు" అన్నాడు సెక్షనాఫీసరు. బాస్ వైపు చూస్తూ.

నేనేం మాట్లాడలేదు. నా మాటలర్థం చేసుకునే తెలివితేటలు వీళ్ళకి లేవు. కొంచెం సెక్షనాఫీసరు నయం! సంబోధనలో మర్యాదివ్వకపోయినా నన్నర్థం చేసుకున్నాడు.

ఏం చెయ్యను? చిన్నప్పటినుంచీ సున్నితంగా పెరిగాను. ఆఖరికి వీళ్ళ దగ్గర పని చెయ్యాల్సి వచ్చింది. ఎ.సి. లేక పోతే అస్సలు పని చెయ్యలేను. వీళ్ళు చెప్పే అర్థమైన పనులతో నా బుర్ర వేడెక్కిపోతుంది. నా అవయవాలు స్వాధీనం తప్పుతాయి. మా ఆఫీసులో ఎ.సి. సరిగా పని చేయదు. అప్పుడప్పుడు జబ్బుంటుంది. నా కష్టాలు ఎవరూ అర్థం చేసుకోరు!

"ఈసారి కనక మళ్ళీ సరిగా పని చేయకపోతే దీన్ని ఇంకో డిపార్ట్‌మెంటుకి ట్రాన్స్‌ఫర్ చేసెయ్యండి" నావైపు చీదరగా చూస్తూ బాస్ గదిలోంచి వెళ్ళిపోయాడు.

నేను దిక్కుమొహం వేసాను. ఈ ఆఫీసులో బొత్తిగా మర్యాద దొరకదు నాకు.

సెక్షనాఫీసరు నావైపు చూసి తల పంకించి వెళ్ళిపోయాడు.

నేను ఒంటరిగా గదిలో మిగిలిపోయాను.

కొన్నిరోజులు గడిచాయి. ఒకరోజు మా బాస్ ధుమధుమలాడుతూ నేనున్న గదిలోకి వచ్చాడు. నా గుండె దడదడలాడింది. మౌనంగా నా పని నేను చేసుకోసాగాను.

"ఈ దరిద్రపుదానివల్ల ఎంత పనయిందో చూసారా?" సెక్షన్ ఆఫీసరుతో అన్నాడు.

నా కళ్ళు ఎండిపోయాయి అప్పటికే.

"ఏమయింది?" ఆశ్చర్యంగా అడిగాడు సెక్షన్ ఆఫీసర్.

"టెన్త్‌క్లాస్ రిజల్ట్స్ అన్నీ తప్పుగా టైపుచేసింది. 'టు' అని నెంబర్ల మధ్య ఉండాల్సినది టైప్ చెయ్యకుండా వదిలేసింది. దానివల్ల మధ్య నెంబర్ల పిల్లలంతా ఫైలయ్యామని గోల మొదలుపెట్టారు. ఇంత కిరసనాయిలు దీని మొహంమీద పోసి దీన్ని తగలపెట్టెయ్యండి" చాలా కోపంగా చెప్పాడు.

నా హృదయం బద్దలయింది. నేను చెయ్యని తప్పులకి నన్ను ఎంత హీనంగా తిడుతున్నారో! ఆ 'టు' టైప్ చెయ్యద్దని ఆ సెక్షనాఫీసరే చెప్పాడు. అది తప్పు అని నాకు తెలిసినా నా మాట ఎవరు వింటారు?

సెక్షనాఫీసరు సాలోచనగా నావైపు చూస్తున్నాడు. నాకు భయం వేసింది.

"ఈ తప్పు నాదికాదు! నన్ను తిట్టద్దు! మీరే నాకు పని సరిగా చెప్పలేదు!" నాలో నేనే ఆక్రోశించాను.

ఇంతకీ నాపేరు మీకు చెప్పలేదు కదూ! నా పేరే కంప్యూటర్!!

(అంకితం : కంప్యూటర్ తప్పులు చేస్తుందనే పెద్దమనుషులకి)


**జె.యు.బి.వి. ప్రసాద్**

ఇంజనీర్, ఆర్ & డి
హిందుస్తాన్ కంప్యూటర్స్ లిమిటెడ్
4-హడ్డౌస్ రోడ్, నుంగంబాక్కం,
మద్రాసు - 6.


## వేస జోక్స

• "నిన్న మాపాప పావలాబిళ్ళ మింగేస్తే డాక్టరు దగ్గరికి తీసెళ్ళాం" చెప్పింది రాధ దిగాలుగా.

"ఏమయింది- డాక్టరేం చేసాడు?" ఆత్రుతగా అడిగింది సరోజ.

"ఆయనో పచ్చనోటు మింగేసాడు" చెప్పింది. —పి. పర్వతశేఖర్ (మార్కాపూర్)

• "సుఖరోగా లెందుకొస్తాయి?"

"సుఖానికి గుర్తుగా"

—పి. రాజమోహన్‌రెడ్డి (నెల్లూరు)

• భర్త : "ఏమిటే ఇవాళ శనివారం అయినా అంత పసుపు రాసుకున్నావు.

భార్య: "లేదండి మన షాప్‌లోని కొత్త టవల్‌తో ముఖం తుడుచుకున్నాను. అంతే. —ఎస్. లక్ష్మి (నర్సీపట్నం)

• "నిన్న తెచ్చిన కిరసనాయిలుఅప్పుడే అయిపోయిందా" అడిగాడు భర్త.

"రోజుకి ఒక అగ్గిపుల్లకంటే ఎక్కువ వేస్ట్ చెయ్యొద్దని మీరేకదా అన్నారు. అందుకని ఉదయం వెలిగించిన స్టవ్ రాత్రి వంట అయ్యేవరకు ఆర్పలేదు" చెప్పింది భార్య. —వి. శ్రీనివాసరావు (ద్రాక్షారామ)

• "నెలలో ఆ 'మూడు రోజులు' బాధగా ఉంటుంది. అసలు నెలనెలా ఆ 'మూడు రోజులు' లేకుండా ఉండాలంటే ఏం చెయ్యాలి డాక్టర్?" అడిగింది వనజ.

"ఏముంది! ప్రతి సంవత్సరం కడుపుతో ఉంటే సరి!" చెప్పింది డాక్టర్ పరిమళ!

—ఇ.డి. దేవప్రసాద్ (కడప)